నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 3 నవంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి



ప్రభుత్వ కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నస్పూర్, నవంబర్ 1 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మంచిర్యాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు నిరసన చేపట్టారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్టిఫికెట్ల కోసం కళాశాలలకు వెళ్తే యాజమాన్యాలు డబ్బుల కోసం విద్యార్థులను వేధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా సర్కారు స్పందించాలని కోరారు. అలాగే కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజి, అన్వేష్, చరణ్, నికిత, సాయి, వైష్ణవి పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యంపై ఆందోళన వద్దు

ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

వాంకిడి, నవంబర్ 2 : వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన విద్యార్థినుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. హాస్టల్‌కు వచ్చిన విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడారు. బయట నుంచి తెచ్చి తిన్న ఆహారంతో ఫుడ్ పాయిజన్ అయి ఉండవచ్చన్నారు. అనంతరం హాస్టల్‌లోని వసతులు, వంట సామగ్రి, కూరగాయలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని, మందుల కొరత లేకుండా చేడాలని ఆదేశించారు. తహసీల్దార్ రియాజ్‌అలీ, హెచ్‌ఎం, వార్డెన్, సిబ్బంది ఉన్నారు.

# కాంగ్రెసోళ్లు కొట్టుకున్నరు

**రణరంగంగా సమావేశం**

## స్టేజీపైనే విశ్వప్రసాద్-శ్యాంనాయక్ వర్గీయుల మధ్య ఘర్షణ

- ధర్నాకు దిగిన నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, ఆయన అనుచరులు
- నాటకీయ పరిణామాల మధ్య అరెస్ట్ చేసిన పోలీసులు


కాంగ్రెస్ పార్టీ సమావేశంలో గొడవకు దిగుతున్న ఇరువర్గాలు



శ్యాంనాయక్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 2 : జిల్లా కేంద్రంలోని రోజ్‌గార్డెన్‌లో శనివారం కాంగ్రెస్ నిర్వహించిన కుల గణన సమావేశం రణరంగంగా మారింది. తమకు సమాచారం లేకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావును నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, అతని వర్గీయులు నిలదీయడంతో ఘర్షణ చోటు చేసుకున్నది. స్టేజీపైనే ఒకరిపై ఒకరు కుర్చీలు విసురుకున్నారు. పిడిగుద్దులు గుద్దుకుంటూ.. వ్యతిరేక నినాదాలు చేసుకున్నారు. ఈ దాడిలో కార్యకర్త గడ్డల సత్తకు గాయాలయ్యాయి. దీంతో పోలీసులు కల్పించుకొని శ్యాంనాయక్‌తో పాటు అతని అనుచరులను సమావేశం నుంచి బయటకు పంపించారు. రోడ్డుపై శ్యాంనాయక్, అతని వర్గీయులు ధర్నా చేశారు. తమపై దాడికి పాల్పడిన అనిల్ గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌పై పోలీసులు కేసు నమోదు చేయాలని పట్టుబట్టారు. ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం కల్పించుకొని శ్యాంనాయక్ వర్గీయులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వారు ఆందోళన విరమిం


తమ కార్యకర్తను గాయపరిచిన వారిని అరెస్ట్ చేయాలని ధర్నా చేస్తున్న శ్యాం నాయక్, అతని అనుచరులు

చలేదు. దీంతో పోలీసులు బలవంతంగా శ్యాంనాయక్‌తో పాటు అతని అనుచరులను అరెస్ట్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐలు బుద్ధస్వామి, రవీందర్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, ఎస్ఐలు రాజేశ్వర్, చంద్రశేఖర్, సిబ్బంది పహారా మధ్య కాంగ్రెస్ పార్టీ సమాశం కొనసాగింది. కాగా, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు వర్గం, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్ వర్గం మధ్య కొంతకాలంగా అంతర్గత పోరు జరుగుతున్న విషయం విదితమే.

## మంచుకురిసే వేళ లో..


*చలి జిల్లాను వణికిస్తున్నది. రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతుండగా, తీవ్రత పెరుగుతున్నది. ఉదయం ఎనిమిదైనా పొగమంచు తొలగకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తున్నది. కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో హెడ్‌లైట్లు వేసుకొని ప్రయాణిస్తుండగా, మరికొందరు సూర్యుడి వెలుతురు వచ్చిన తర్వాతే బయటకు అడుగుపెడుతున్నారు. ఇక సాయంత్రం ఏడింటికే ఇగం మొదలవుతుండగా, రైతులు, కూలీలు, వ్యాపారులు త్వరగా పనులు ముగించుకొని ఇండ్లకు చేరుతున్నారు. కాగా, శనివారం ఉదయం పలుచోట్ల 'నమస్తే' 'క్లిక్' మనిపించిన దృశ్యాలు మీ కోసం..*

*- దండేపల్లి/బెజ్జూర్/తాండూర్, అక్టోబర్ 2*


కుకుడలో కూరగాయలు అమ్ముతున్న రైతు


బెజ్జూర్ మండల కేంద్రంలో ఉదయం 6.30 గంటలకు లైట్లు వేసుకొని వెళ్తున్న బస్సు


తాండూర్‌లో రహదారిపై కమ్ముకున్న పొగమంచు


తాళ్లపేట పొలాల వద్ద కప్పేసిన పొగమంచు

# అప్రకటిత కోతలు.. అన్నదాతకు అవస్థలు

**రోజుకు 10 గంటలకు పైగా కరెంట్ కట్**

- దహెగాం మండలంలో ఎండిపోతున్న వరి
- పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు
- రైతులకు తీరని నష్టం


కరెంటు కోతల కారణంగా ఎండుతున్న వరి పంట

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/దహెగాం, నవంబర్ 2 : అప్రకటిత విద్యుత్ కోతలు రైతులకు శాపంగా మారాయి. బోర్లపై ఆధారడి వ్యవసాయం చేసుకునే వారికి తీరని నష్టాన్ని మిగిలిస్తున్నాయి. కళ్లముందే ఎండిపోతున్న పంటలను చూసి అన్నదాతలు కన్నీళ్లుపెట్టుకుంటున్నారు. జిల్లాలోని దహెగాం మండలంలో దాదాపు 6 వేల ఎకరాల్లో వరి పండిస్తున్నారు. గతంలో ఈ మండలంలో 350 వరకే విద్యుత్ కనెక్షన్లుండేవి. కేసీఆర్ పాలనలో 24 గంటల పాటు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో వాటి సంఖ్య పెరుగుతూ వచ్చింది. వందలాది మంది రైతులు 1500 పైగా బోర్లు వేసుకొని ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకుంటూ రంది లేకుండా రెండు పంటలు తీస్తూ వచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. అప్రకటిత కోతలు మొదలయ్యాయి. కరెంటు ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పంట చేతికొచ్చే సమయంలో రోజుకు 10 గంటలకుపైగా కరెంటు కోతలు విధించడం వల్ల పంటలు ఎండిపోతున్నాయి. లో ఓల్టేజీ సమస్యల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు కూడా కాలిపోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లకు సకాలంలో మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా చేయాల్సి ఉండగా, అధికారులు పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### దిగుబడి వస్తుందనే నమ్మకం లేదు

*3 ఎకరాల్లో వరి సాగు చేస్తున్న. దాదాపు నెల రోజులుగా విద్యుత్ సరిగా ఉండడం లేదు. వరి పంటకు నీళ్లు పెట్టలేక పోతున్న. పొలం పూర్తిగా ఎండిపోతున్నది. వరి పొట్టదశలో ఉన్నప్పటి నుంచి విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి. దీంతో దిగుబడి బాగా తగ్గే ప్రమాదముంది. కేసీఆర్ సర్కారులో ఎకరానికి 22 నుంచి 25 బస్తాలు దిగుబడి వచ్చేది. కానీ.. ఈ సారి విద్యుత్ కోతల వల్ల పంట దిగుబడి వస్తుందనే నమ్మకం లేదు. విద్యుత్ కోతల గురించి అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.* **- చిన్నకర్ రమేశ్, దహెగాం**





### అధికారులు పట్టించుకుంటలేరు

*నాలుగు ఎకరాల్లో వరి వేసిన. కరెంటు కోతల కారణంగా పొలానికి సరిగా నీరందడం లేదు. అధికారులకు చెబితే పట్టించుకోవడం లేదు. కోతలు లేవని చెబుతూనే రోజుకు 10 గంటలకుపైగా కట్ చేస్తున్నరు. గతేడాది 24 గంటల కరెంటుతో రెండు పంటలు తీసినం. ఈ ఏడాది కరెంటు కోతల కారణంగా వర్షాకాలం పంట కూడా సరిగా వచ్చేలా లేదు. దహెగాం మండలంలో వరి పండిస్తున్న రైతులందరి పరిస్థితి గిట్లనే ఉంది.*

**- మామిడి బాలు, దహెగాం**

## ఆటో డ్రైవర్ల మహాధర్నా పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

సీసీసీ నస్పూర్, నవంబర్ 2 : సీసీసీ నస్పూర్‌లో బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి చెల్ల విక్రమ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఆటో డ్రైవర్ల మహాధర్నా పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర జేఏసీ ప్రణాళిక చైర్మన్ గాజుల ముకేష్‌గౌడ్, రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు మంద రవికుమార్, బీఆర్‌టీయు రాష్ట్ర కార్యదర్శి నీలారపు రవి, రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య, వివిధ ఆటో యూనియన్ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 5న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఉచిత బస్సు పథకం ద్వారా ఆటోడ్రైవర్ల జీవితాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి అద్దెలు, స్కూల్ ఫీజులు, ఫైనాన్స్‌లు కట్టలేక ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చనిపోయిన ఆటోడ్రైవర్ల కుటుంబాలకు రూ.25 లక్షలు, వారి కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని, రూ. వెయ్యి కోట్లతో ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు పైబడిన డ్రైవర్లకు పింఛన్ అందించాలన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయిన వారికి రూ.5 లక్షల ప్రమాదబీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జేఏసీ అధ్యక్షుడు రేణుకుంట సురేశ్, కార్యదర్శి సదయ్య, మంచిర్యాల పట్టణ కార్యదర్శి బోరె వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి ఎండీ షఫీ, కోశాధికారి తగరపు శ్రీనివాస్, శ్రీరాంపూర్ గౌరవ అధ్యక్షుడు గోలేటి శివ, సీసీసీ కార్నర్ అధ్యక్షుడు రామన్న పాల్గొన్నారు.

## దండారీ సంబురం

*కెరమెరి మండలంలో దండారీ సంబురాలు కొనసాగుతున్నాయి. శనివారం రాసిమెట్ట గ్రామానికి చెందిన మహిళా దండారీ గోండ్ ఝురికి రాగా, స్థానిక మహిళలు వారికి ఘన స్వాగతం పలికారు. డప్పు చప్పుళ్ల నడుమ రేలారే రేలా నృత్యాలతో హోరెత్తించారు. హాస్య నాటికల ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. సాకడ, మెట్టపిప్రీ గ్రామాల్లో కోలాబొడితో సంబురాలు ముగించారు.*

*- కెరమెరి, నవంబర్ 2*


డప్పులు వాయిస్తున్న దండారీ బృందం

## హరిద్వార్‌కు అఘోరీ!

**శుక్రవారం అర్ధరాత్రి సరిహద్దు దాటించిన పోలీసులు**

నెన్నెల, నవంబర్ 2 : మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కుశ్నపల్లికి చెందిన అఘోరి మాత అలియాస్ ఎల్లూరి శ్రీనివాస్‌ను పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా రాష్ట్ర సరిహద్దు దాటించారు. నవంబర్ ఒకటో తేదీన సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ గుడి వద్ద ఆత్మార్పణం చేసుకుంటానని ప్రకటించగా, పోలీసులు గృహ నిర్బంధం చేసిన విషయం విదితమే. శుక్రవారం అఘోరీ తల్లిదండ్రులు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను కలిశారు. సంయమనం పాటించాలని ఆయన సూచించారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అఘోరి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆపై అఘోరిని ఇక్కడి నుంచి తరలించాలని నిర్ణయించుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్ సరఫరా నిలిపివేసి గుట్టుచప్పుడు కాకుండా మహారాష్ట్ర సరిహద్దులోని లకిడికోట్ వద్ద వదిలిపెట్టారు. హరిద్వార్ పయనమవుతానని అఘోరి పోలీసులకు తెలిపినట్లు సమాచారం.